ప్రజాశక్తి
ఆదివారం 14 జనవరి 2024
5
అనంతపురం

నాసిన్ కంపెనీ వద్ద ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రధానమంత్రి భద్రతా కార్యాలయ అధికారులు

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్, గోరంట్ల రూరల్

ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఈనెల 16వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో పర్యటించనున్నారని, ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పర్యటను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం నాడు పాలసముద్రంలోని నాసిన్ కేంద్రం వద్ద, హెలీప్యాడ్, పలు భవనాలు, వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై అడ్వాన్స్ సెక్యూరిటీ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి కార్యాలయం భద్రత అధికారులు పికె.యాదవ్, డిఐజి అమ్మిరెడ్డి, కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎస్‌పిజితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 16న మధ్యాహ్నం ప్రధాని పాలసముద్రం చేరుకుని అక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ప్రధాని వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేని విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాని వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రివర్యులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగానే చేసుకోవాలని చెప్పారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రత, రవాణా, వసతి, వైద్య సేవలు వంటివి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ సమన్వయంతో అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు సహా ఇతర హోర్డింగ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐదు అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఫైర్ వాహనాలూ అందుబాటులో ఉంచాలన్నారు. పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్, నాసిన్ హెలిప్యాడ్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి జిల్లా యంత్రాంగం తరపున పాస్‌లు జారీ చేయాలని డిఆర్ఒ, పుట్టపర్తి ఆర్డీవోకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకష్ణ, రమేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'తోపుదుర్తి' చుట్టూ

హౌసింగ్ వివాదం

◆ నా తప్పేమీ లేదంటున్న ప్రకాష్‌రెడ్డి ◆ ఎవరూ కిడ్నాప్ అవలేదంటూ డీఎస్పీ వివరణ



అనంతపురంలో విలేకరులతో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం రూరల్ మండల పరిధిలోని కొడిమి వద్దనున్న హౌసింగ్ లేఅవుట్ కార్మికులను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కిడ్నాప్ చేసారంటూ పెద్దఎత్తున ప్రచారం నడిచింది. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, పోలీసులు మాత్రం ఎటువంటి కిడ్నాప్ లేదని దురుద్దేశంతో కొంత మంది చేస్తున్న దుష్ప్రచారమని కొట్టి పారేశారు. శనివారం ఉదయం నుంచి ఈ అంశం జిల్లాలో పెద్ద దుమారమే రేగింది. ఈ వివాదానికి సంబంధించి వారివారి వాదనలు ఇలా ఉన్నాయి.

డబ్బులివ్వలేదని కార్మికుల కిడ్నాప్
కాంట్రాక్టర్ సర్వర్ జహా

తాను అడిగినంత డబ్బులివ్వలేదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన బామ్మర్ది కలిపి తన సంస్థకు సంబంధించిన తొమ్మిది మంది కార్మికులను నిర్బంధించారని లేబర్ కాంట్రాక్టర్ సర్వర్ జహా ఆరోపిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం అయ్యింది. కనబడకుండా పోయిన తొమ్మిది కార్మికులను విడిపించాలని పశ్చిమబెంగాల్ ఎంపి ఒకరు జిల్లా అధికారులకు రాసిన ఉత్తరం వాట్సప్ గ్రూపుల్లో సర్క్యులేట్ అయ్యింది. తన లాయర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కాంట్రాక్టర్ సర్వర్ జహా వీడియోలో పేర్కొన్నారు.

కార్మికులు ఎక్కడికీ పోలేదు
డీఎస్పీ శివారెడ్డి.

కార్మికులు అదృశ్యం అయ్యారని ప్రచారం జరుగుతుండటం అవాస్తవమని అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే కొడిమి లేఅవుట్ ప్రాంతంలో పర్యటించామంటూ ఒక వీడియోను విడుదల చేశారు. మాయమ్యారని చెబుతున్న తొమ్మిది మంది కార్మికులు క్షేమంగా ఉన్నారని తెలిపారు. వీరెవరూ కిడ్నాప్‌కు గురవలేదని, వారిపనులు వారు చేసుకుంటున్నారన్నారు. కిడ్నాప్ అంటూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు.

కావాలనే దుష్ప్రచారం
ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

కావాలనే తెలుగుదేశం నాయకులు, కొంత మంది పనిగట్టుకుని తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయిం చేందుకు సొంత డబ్బులు ఖర్చు పెట్టానన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేక తెలుగుదేశం నాయకులు ఇలాంటి అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సర్వర్ జహా అనే కాంట్రాక్టరే డబ్బులు తీసుకుని పనిచేయకుండా పారిపోయారన్నారు. అదృశ్యం అయ్యారని చెబుతున్న కార్మికులు పనులు చేసుకుంటున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేక తాను వందల కోట్లు సంపాదించాననే అర్థంలేని ఆరోపణలు కొందరు చేస్తున్నారన, ప్రజలెవరూ వీటిని పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు.

జిల్లా వ్యాప్తంగా 'సామాజిక సమతా సంకల్పం'

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సామాజిక సమతా సంకల్పంలో భాగంగా జన్ భాగిదరి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. సామాజిక సమతా సంకల్పంలో భాగంగా జిల్లాలో జన్ భాగిదరి కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శనివారం నాడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లాలోని 663 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సిటిజెన్ల రిజిస్ట్రేషన్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయడం, సోషల్ అవేర్‌నెస్ క్యాంపులు, ఫ్లెక్సీ బోర్డుపై సంతకాలు చేయడం లాంటి కార్యక్రమాలను పూర్తి చేసినట్లు చెప్పారు. 17న తేదీన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు సుందరీకరణ, పూలమాల వేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 18న అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మానవహారాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో మారథాన్ రక్తదాన శిబిరాలు, జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, కలెక్టర్లను రెవెన్యూ భవనంలో జిల్లా సమావేశం నిర్వహించాలన్నారు. 19న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాన్ని అనంతపురం కలెక్టర్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను కలెక్టర్ ఎస్.గౌతమి తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు, సిరి సంపదలతో తులతూగుతూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

భోగి మంటలు కాదు..కడుపు మంటలు

పుట్లూరు చెరువులో దిగి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు,సిఐటియు నాయకులు

కొనసాగిన అంగన్వాడీల సమ్మె
భోగి మంటల్లో ఎస్మా ప్రతులు దహనం

ఉరవకొండ వద్ద కెనాల్‌లో ఎస్మా ప్రతులను వదులుతూ అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-విలేకరులు

గుత్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు భోగి మంటలు వేసి అందులో షోకాజ్ నోటీసులను వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 'వి భోగి మంటలు కాదని..తమ కడుపు మంటలు' అంటూ నినాదాలు చేశారు. శిబిరం వద్ద పట్టణానికి చెందిన విజయకుమార్ అలియాస్ జూనియర్ ఏఎన్ఆర్ అనే కళాకారుడు నృత్యం చేస్తూ సంఘీభావం తెలిపారు. సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల,రైతు సంఘం నాయకుడు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు శోభారాణి, కళ్యాణి, పార్వతి, శారద, బావమ్మ, నాగరత్న, గంగ తదితరులు పాల్గొన్నారు. బుక్కరాయసముద్రం మండలం కేంద్రంలో అంగన్వాడీలు జగనన్నకు చెబుదాం అంటూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, శింగనమల ప్రాజెక్టు కార్యదర్శి కె.కాత్యాయని, గ్రామ పెద్దలు పొడరాళ్ల రవీంద్ర, మండల సెక్టార్ లీడర్లు విమల, సుజాత, రత్నమ్మ, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, గీత, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, రైతుసంఘం నాయకులు సంజీవరెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, సిఐటియు మండల నాయకులు నెట్టికంటయ్య, వ్య.కా.సం నాయకులు నాగలింగమయ్య, నారాయణస్వామి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు. పుట్లూరు మండల కేంద్రంలోని అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం స్థానిక చెరువులోకి దిగి నిరసన తెలిపారు. వీరికి వ్య.కా.సం జిల్లా అధ్యక్షుడు సూరి మాట్లాడుతూ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి వెంకటచౌదరి బి.భాస్కర్‌రెడ్డి, టి.పెద్దయ్య, నాగభూషణ్, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. రాయదుర్గంలో అంగన్వాడీ కార్యకర్తలు విధులకు హాజరు కావాలని కోరుతూ ఐసిడిఎస్ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. విధులకు హాజరుకాకుంటే ఎస్మా చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ అంగన్వాడీ కేంద్రాల వద్ద నోటీసులు అతికించారు. కాగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం కొనసాగింది. అధికారులు సమ్మె నోటీసు జారీ చేసినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. నార్పల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పభుత్వం పంపిన నోటీసులను భోగి మంటల్లో కాల్చివేశారు. అనంతరం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నల్లప్ప, నాగరాజు, కుళ్లాయప్ప, ప్రాజెక్టు అధ్యక్షురాలు డొక్కా శ్రీదేవి, రామాంజినమ్మ, కళావతి, సుధామణి, రేణుక, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.గుమ్మఘట్ట మండలలో ముగ్గులు వేసి అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ, సెక్టార్ నాయకురాళ్లు రాధిక, మెహ్రూన్, రుద్రమ్మ, చంద్రకళ, మల్లమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు. ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రలలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. వీరికి సిపిఎం, సిపిఐ సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా ఉరవకొండ శివారులో ఉన్న హంద్రీనీవా కెనాల్‌లో ఎస్మా ప్రతులను వదులుతూ నిరసన తెలిపారు. విడపనకల్ మండలంలో 'గోవిందా..గోవిందా' అంటూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, వరలక్ష్మి, జ్యోతి, వెంకటలక్ష్మి, రబియా, గీత, శివగంగ, మస్తానమ్మ, ఎర్రమ్మ, జయమ్మ, రంగమ్మ, శ్వేతనాగు, సరోజమ్మ, బ్యులా, ధనలక్ష్మి, జ్యోతి, రామంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు. పామిడి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం కూడా కొనసాగింది. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా అంగన్వాడీలు పాల్గొన్నారు. అనంతపురంలో అంగన్వాడీలకు టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, టిడిపి మైనారిటీ జిల్లా అధికార ప్రతినిధి జెఎం.బాషా, ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి చిరోల్ల రామాంజినేయులు, బీసీ నాయకులు మల్లికార్జున, ముత్యాలు, మంజుల, నారాయణ, తదతరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో అంగన్వాడీకి నోటీసు అందజేస్తున్న అధికారులు

గుమ్మఘట్టలో ఎస్మా రద్దు చేయాలని వేసిన ముగ్గు

పామిడిలో భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

బుక్కరాయసముద్రంలో కోటి సంతకాలను సేకరిస్తున్న అంగన్వాడీలు

కంపోస్టు యార్డులో ఎగసి పడుతున్న పొగ

పది రోజులైనా తగ్గని పొగ కాలుష్యం

ఇబ్బందులు పడుతున్న రాయదుర్గం వాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ పొలిమేరలోని కంపోస్టు యార్డులో చెత్తకు నిప్పంటుకోవడంతో దాదాపు 10 రోజుల నుంచి విపరీతంగా పొగ వస్తోంది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నప్పుడు ఈనెల 3న కంపోస్టు యార్డులో చెత్తకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది కలిసి అగ్నిమాపక దళం సాయంతో మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ చెత్త నిల్వలు భారీగా ఉండటంతో బయట మంటలు కనిపించకపోయినప్పటికీ విపరీతంగా పొగ వస్తోంది. దీంతో శాంతినగర్, పార్వతీనగర్, వాల్మీకినగర్ కాలనీవాసులతోపాటు బళ్లారి రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు పొగ కాలుష్యానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అటుగా వెళ్లే సమయంలో ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోగా మరోసారి చెత్తను చదును చేసి పొగ, మంటలను పూర్తిగా ఆపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంపోస్టు యార్డు నుంచి ఉధృతంగా వస్తున్న పొగ

పేదలకు అండగా వైఎస్ఆర్ బీమా

అనంతపురం : పేదలకు వైఎస్ఆర్ బీమా అండగా నిలుస్తోందని రుద్రంపేట వైసిపి నాయకులు ఆదినారాయణ నాయక్ అన్నారు. రుద్రంపేట పంచాయతీకి చెందిన గడ్డం మహేష్‌బాబు మృతిచెందడంతో వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన రూ.10వేల అత్యవసర సాయాన్ని శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మంజు భార్గవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య

ప్రజాశక్తి-రాయదుర్గం

త్వరలో జరగనున్న అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేసి జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామని వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రాయదుర్గంలోని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నివాసంలో ఎంపీ అభ్యర్థి శంకరనారాయణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పైలా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపును దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల ఎంపికలో మార్పులు, చేర్పులు చేశారన్నారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు, గందరగోళ పరిస్థితి లేదన్నారు. గెలుపే అంతిమ లక్ష్యంగా, అధికారమే పరమావధిగా అభ్యర్థులు ఎవరైనా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపోతే ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గం, కళ్యాణదుర్గం స్థానాల్లో తాను పోటీకి సిద్ధమని ప్రకటించడం బాధాకరమన్నారు. కాపు రామచంద్రారెడ్డికి పార్టీ మూడుసార్లు అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికయ్యాక విప్ పదవి కూడా ఇచ్చారన్నారు. పార్టీని వీడి బయటకు వెళ్లిన వ్యక్తులు ఎమ్మెల్యేలు అయినా చెల్లని రూకతో సమానం అన్నారు. శంకరనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో గతంలో ఎవరూ అమలు చేయలేని సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి రూ.లక్షల కోట్ల లబ్ధిని చేకూర్చారన్నారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ తాను పార్టీ, ప్రజలకు చేసిన సేవను గుర్తించి సీఎం జగన్ గుర్తించి ఇప్పటికే ఎపిఐఐసి అధ్యక్ష పదవిని ఇచ్చారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ సమన్వయకర్తగా అవకాశం ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, ఉపాధ్యక్షులు వలిబాష, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, నాయకులు శివప్ప, చిక్కన్న, మల్లికార్జున, ఉషారాణి, రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య

బహుమతులు అందజేస్తున్న అతిథులు

విజేతలకు బహుమతులు ప్రదానం

గుత్తి : ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో విజేతలైన క్రీడాకారులకు ప్రజాప్రతినిధులు శనివారం బహుమతులు అందజేశారు. స్థానిక పట్టణంలోని క్రీడా మైదానంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపీపీ జి.విశాలాక్షి ట్రోఫీతోపాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, ఎంపిడిఒ చిట్టా శ్రీనివాసులు, వైసీపీ పట్టణ మండల కన్వీనర్లు డి.హుస్సేన్ పీరా, జి.గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు నదీముల్లా ఫారూఖ్, వి.వరద, నరేష్, వెంకటరమణ, వైసిపి నాయకులు ఎం.రంగస్వామి, వై.సుభాష్‌రెడ్డి, డి.షఫీ, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు శ్రీధర్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈడిగ సాధికార కమిటీ ఉపాధ్యక్షులుగా గాదిలింగప్ప

పామిడి : అనంతపురం పార్లమెంటు ఈడిగ సాధికార కమిటీ ఉపాధ్యక్షులుగా పామిడి గాదలింగప్పగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం అనంతపురంలోని టిడిపి కార్యాలయంలో ఎపి రాష్ట్ర ఈడిగా సాధికార కమిటీ అధ్యక్షులు అమరనాథ్‌గౌ, టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు సమయక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గాదిలింగప్ప గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని ఈడిగ సోదరులు అందరూ టిడిపి అధికారంలోకి రావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌గౌడ్, నరేష్‌గౌడ్, ధనుగౌడ్, నరసింహులుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

కుందుర్పిలో ఖాళీ బిందెలతో ధర్నా

ప్రజాశక్తి-కుందుర్పి

తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు మహిళలు శనివారం మండల కేంద్రంలోని రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 20 రోజులుగా మండల కేంద్రంలోని మంగళ వీధి, బోయ వీధి, కురాకుల వీధి తదితర వీధుల్లో తాగునీటి సమస్య నెలకొందన్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. చేసేది లేక ధర్నాకు దిగినట్లు వివరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, పంచాయతీ అధికారులు మహిళల వద్దకు వచ్చి చర్చించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

పట్టణ ప్రగతి యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని 49వ డివిజన్ పరిధిలో ఉన్న ఇందిరానగర్‌లో పట్టణ ప్రగతి యూనిట్‌ను మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రగతి యూనిట్ కింద కంప్యూటర్ ఎంబ్రాయిడరీపై స్కిల్ డెవలప్‌మెంట్‌తో నాలుగు రోజులు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న స్వయం సహాయక సభ్యులు ఇలాంటి యూనిట్లను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్ మునిశేఖర్, పలువురు కార్పొరేటర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి యూనిట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

పింఛన్లు పంపిణీ

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో మంజూరైన పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ షకీలాబేగం మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి అనారోగ్యం కారణంగా డబ్బులు డ్రా చేసుకురావడంలో ఆలస్యం అయిందన్నారు. దీంతో ఈసారి పింఛన్ల పంపిణీలో కొంత ఆలస్యం అయిందని తెలిపారు.

సమాజ ప్రగతికి శాస్త్రీయ ఆలోచనలు అవసరం

జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజ ప్రగతికి శాస్త్రీయ ఆలోచనల అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం 'ప్రజా సైన్స్ గీతాలు' సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న వెనుకబాటుతనాన్ని తొలగించి, సమాజ ప్రగతి కోసం శాస్త్రీయంగా ఆలోచించే విషయంలో జెవివి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రజా సైన్స్ ఉద్యమం పేరుతో 40ఏళ్లుగా జెవివి కృషి చేస్తోందన్నారు. ఇందులో డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు వంటి వారు భాగస్వామ్యులుగా ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జెవివి జిల్లా కమిటీ నాయకులు జిలాన్‌బాషా, గాంగేనాయక్, నగర కమిటీ నాయకులు రామిరెడ్డి, వీర్రాజు, సాకే లక్ష్మీనారాయణ, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్లూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో సిపిఎం రూపొందించిన నూతన క్యాలెండర్‌ను శనివారం రైతులు, కూలీలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల మండల కార్యదర్శి సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకట్‌చౌదరి, మండల నాయకులు టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, రైతులు, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఉపకార వేతనాలను అందజేస్తున్న అతిథులు

రాయదుర్గం : రాయదుర్గంలో నిరుపేద విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. శారదా దేవి ట్రస్టు ఆధ్వర్యంలో వేణు గోపాలస్వామి ఆలయంలో ట్రస్టు నిర్వాహకులు అర్చనానంద అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29 మంది విద్యార్థులకు సుమారు రూ.3లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మేకల శ్రీనివాసులు, ఎంఇఒ వెంకటరమేష్, ట్రస్టు సభ్యులు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు యోగా శిక్షకురాలు కృష్ణవేణి

అనంతపురం : నగరంలో 2వ రోడ్డులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మహిళా యోగా శిక్షకురాలిగా పని చేస్తున్న కె.కృష్ణవేణి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైంది. ఈమె జనవరి 26న ఢిల్లీలో జరగబోయే రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొని యోగాసనాలు ప్రదర్శించనుంది.

పిఎసిఎస్ డైరెక్టర్ పదవితోపాటు వైసీపీకి రాజీనామా

శివప్రసాద్

ఉరవకొండ : ఉరవకొండ పిఎసిఎస్ డైరెక్టర్ పదవితోపాటు వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు బ్యాళ్ల శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ విధి విధానాల నచ్చక రాజీనామా చేసినట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : ప్రపంచం డైబెటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేణుగోపాల్‌రెడ్డి డైబెటిక్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో డైబెటీస్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈపోటీల్లో అనంతపురం జోన్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాలల నుంచి మూడు కేటగిరిల్లో 150 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్లు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

నిజాయితీగా పని చేస్తుంటే బురదజల్లే ప్రయత్నం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎంతో నిజాయితీగా పని చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే పరిటాల కుటుంబతోపాటు పచ్చమీడియా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిటాల కుటుంబం ఏరోజూ ఈ ప్రాంతానికి తాగునీరు తెచ్చే ప్రయత్నం చేయలేదన్నారు. స్థానికుడిని కాబట్టి ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన వాసిగా ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు రూ.95కోట్లతో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇన్నేళ్లు ప్రజలతో ఓట్లు వేయించుకుని అభివృద్ధి చేయకపోగా ఇప్పుడు గొప్పలు చెప్పుకునేందుకు సిగ్గులేదా? అని నిలదీశారు. అధికారం కోల్పోయినప్పటి నుంచి పరిటాల కుటుంబం నిద్రపోవడం లేదన్నారు. నిత్యం తనతోపాటు సిఎం జగన్‌పై ఏడుస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన లేబర్ కోసం లోటస్ అనే వ్యక్తికి రూ.55 లక్షలు అడ్వాన్స్‌గా ప్రభుత్వం చెల్లించిందన్నారు. దీంతో అతను పని చేయించకుండా వెళ్లిపోయాడన్నారు. అలాంటి వాడితో తాను డబ్బులు డిమాండ్ చేయడమేంటని ప్రశ్నించారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన ఎల్లో మీడియాపై పరువు నష్టం దావా చేస్తామన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాల కోసం లేబర్ కాంట్రాక్ట్ తీసుకుని పారిపోతే సంస్థకు పరిటాల శ్రీరామ్, సిపిఐ రామకృష్ణ మద్దతు ఇవ్వడం బాధాకరమన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. తనను విమర్శించే స్థాయి రామకృష్ణకు ఉందా? అన్నారు. టిడిపికి తోకపార్టీగా ఉంటూ తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకపోతే పరిటాల కుటుంబం ఓడిపోయినప్పటి నుంచి నియోజకవర్గం వదిలి పారిపోయిందన్నారు. ఇక్కడ చేతకాదని భావించి ధర్మవరం అంటున్నారన్నారు. దీంతో రాప్తాడులో అభ్యర్థి కోసం టిడిపి వెతుకుతోందన్నారు. ఇప్పటికైనా పరిటాల కుటుంబం, ఎల్లోమీడియా, సిపిఐ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

ప్రశాంత జీవనం సాగించాలి : డీఎస్పీ

పెద్దపప్పూరు : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని డీఎస్పీ గంగయ్య సూచించారు. శనివారం మండలం పరిధిలోని నరసాపురం, వరదయ్యపల్లి గ్రామాల్లో డీఎస్పీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల హడావుడి మొదలవుతుందన్నారు. కావున ఎవరూ గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. అలాకాకుండా సమస్యలు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌చంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించడమే ధ్యేయం

ఉరవకొండ : ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వజ్రకరూరు వైస్ ఎంపిపి ముండ్ల సుంకమ్మ తెలిపారు. శనివారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని పిసి ప్యాపిలి, కొత్తకోట గ్రామాల్లో నూతన బోరు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జ్యోతిబాయి, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నిత్యసురభి' సేవలు స్ఫూర్తిదాయకం : ఏఎస్పీ

నిత్యాసరాలను అందజేస్తున్న నిత్యసురభి ట్రస్టు నిర్వాహకులు

అనంతపురం : నిత్యసురభి ట్రస్టు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని అదనపు ఎస్పీ మల్లికార్జునవర్మ కొనియాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలామురళి ఆధ్వర్యంలో ప్రజలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సరుకుల పంపిణీకి ధర్మవరానికి చెందిన వరలక్ష్మి, రాముడు, వారి కూతురు అల్లుడు వసంతలక్ష్మి, గోపాల్ సహకారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఎస్పీ మాట్లాడుతూ దేవుడు మనకు ప్రసాదించిన కొంతలో పేదలకు సహాయం చేయాలని ఆలోచన రావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను సంతోషంగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, భాగ్యలక్ష్మి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం

ఉరవకొండ : ఈనెల 19న విజయవాడ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు మీనుగ ఎర్రిస్వామి, మల్లప్ప, ఉమాశంకర్, జగదీష్, సంగప్ప, వీరాంజినేయులు, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, నాయకులు సుంకన్న, సుబ్బమ్మ, గంగాధర్, రాజా, ఆనంద్, రమేష్, ఎర్రిస్వామి, మోపిడి ప్రసాద్, రమేష్, అక్కులప్ప, సంగప్ప, ఎర్రనాగప్ప, జయపురం సంజీవ, దేవరాజు, ఎర్రిస్వామి, రాజశేఖర్, నాగరాజు, యువరాజ్, ఉలిగన్న,వీరప్ప, లక్ష్మన్న, జయరాం, ప్యాపిలి కిష్ట, వీరాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం స్వాధీనం

మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఎస్పీ శ్రీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శెట్టూరు ఎస్ఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కర్నాటక మద్యంపై దాడులు నిర్వహించారు. బాదపల్లి క్రాస్ వద్ద 672 కర్నాటక టెట్రా పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని ఏ.కొండాపురం గ్రామానికి చెందిన పరిమి ఓబుళనాయుడు నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఓబుళనాయుడు మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటజూదరుల అరెస్టు

శింగనమల : మండల పరిధిలోని ఆకులేడు గ్రామ శివార్లలో పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు ఆకులేడు శివార్లలో కొంతమంది జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.17,040 నగదు, నాలుగు మోటారు సైకిళ్లు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైసిపిపై ప్రజల్లో వ్యతిరేకత

'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు అన్నారు. శనివారం మండలంలోని కొండాపురం 1వ వార్డులో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధకారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపిని సాగనంపేందుకు సమిష్టిగా పని చేద్దామన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకుంటేనే మనకు భవిష్యత్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మయ్య, మునీంద్ర, గోవర్ధన్, భాస్కర్, అల్లిపీరా, ప్రతాప్, తిరుపాలు, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, మాధవి, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులోని బండగేరి, పైమాలవాడలో శనివారం బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధకారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్, గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు నరేంద్రచౌదరి, రామాంజనేయులు, సుధాకర్‌నాయుడు, ఆర్.బి.రమేష్, సూరి, శేఖర్, సురేష్,వినయ్, రమేష్‌యాదవ్, మల్లి, రంగస్వామి, సన్నీ, కళ్యాణ్, ధనాచారి, ఆర్.బి.అయ్యప్ప, షేక్షావలి, వంశీ, కోట పవన్, రమేష్, సుంకన్న, రంగారెడ్డి, వెంకటశివుడు, ఆనంద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి మండలం కొండాపురంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు

ప్రభాకర్‌చౌదరితోనే 'అనంత' అభివృద్ధి

అనంతపురం కలెక్టరేట్ : మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరితోనే అనంతపురం అభివృద్ధి సాధ్యమని రజక సాధికారిక కమిటీ నాయకులు అన్నారు. శనివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో రజక సాధికారిక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనంతపురం అభివృద్ధి చెందిందంటే గత టిడిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ప్రభాకర్‌చౌదరి కారణమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆయన్నే ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సాధికారిక సమితి నాయకులు రమేష్‌బాబు, వెంకటేష్, మల్లేష్, సీనా, వెంకటరాముడు, ఆది, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఉరవకొండ : అనారోగ్య బాధితులైన నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో పంపిణీ చేశారు. ఉరవకొండకు చెందిన దివంగత వైసిపి నాయకుడు బ్యాంకు ఓబులేసు భార్య రాజేశ్వరికి రూ.2 లక్షలు, పిచ్చికుంట్ల ఉలిగమ్మకు రూ.3.40 లక్షలు, కూడేరు మండలం కలగళ్ల గ్రామానికి చెందిన శ్రీదేవికి రూ.65 వేలు, బెలుగుప్ప మండలం అంకంపల్లి గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీకి రూ.1.60 లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, పట్టణ కన్వీనర్ ఎసీ ఎర్రిస్వామి, వన్నప్ప, సుబ్బమ్మ, ఇప్పేరు రమేష్, జయపురం సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

అంబేద్కర్ కాలనీలో మురుగు తొలగింపు

మురుగునీటిపై మట్టిని వేస్తున్న పంచాయతీ కార్మికులు

నార్పల : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఉన్న మురుగు నీటిని అధికారులు శుక్రవారం తొలగించారు. కాలనీలో నెలకొన్న మురుగు నీటిని తొలగించాలని స్థానికులు ఎన్నోమార్లు అధికారులకు విన్నవించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎంపిడిఒ దివాకర్, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు పంచాయితీ సిబ్బందితో మురుగునీరు ఉన్న చోట మట్టిని వేయించారు. సెలవు రోజు అయినప్పటికీ సమస్య తెలిసిన వెంటనే స్పందించిన ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ పాలనలో సామాన్యులకు కష్టాలు

టిడిపి కన్వీనర్ బోయ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యులు కనీసం పండుగ చేసుకోలేని స్థితికి రాష్ట్రంలో సిఎం జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిందని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో సంక్రాంతి, ఉగాది, క్రిస్మస్ పండుగలకు కానుకలు ఇచ్చి పేదలు సుఖసంతోషాలతో పండుగ జరుపుకేనేలా చేసిందని గుర్తు చేశారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక కానుకలన్నీ ఎత్తివేశారన్నారు. దీనికితోడు నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచడంతో సామాన్యులు సంతోషంగా పండుగ కూడా చేసుకోలేని పరిస్థితికి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఈ విషయాలన్నీ ప్రజలు గమణించి రానున్న ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కన్వీనర్ అనుమప్పచౌదరి, నియోజవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు రమేష్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు, నాయకులు బొమ్మయ్య, అంకే ఆనంద్, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి కన్వీనర్ బోయ శ్రీనివాసులు

మార్పుల మంటలు



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఎన్నికల సమయం సమీస్తున్న కొద్ది రాజకీయాల్లో వేడి రాజుకుంటోంది. ప్రధానంగా వైసిపి ఒక్కోస్థానంపై స్పష్టత ఇస్తూ పోతోంది. ఇప్పటి మూడు జాబితాలు విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలకు సంబంధించి కొత్త సమన్వయకర్తలను నియమించింది. వీరే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉంటారని ప్రకటించింది. రెండో జాబితాలో కళ్యాణదుర్గం, పెనుకొండ, కదిరి అసెంబ్లి స్థానాలకు సంబంధించి కూడా సమన్వయకర్తలను ప్రకటించింది. మూడో జాబితాలో రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి కొత్త అభ్యర్థి వచ్చారు. ఈ మార్పులు, చేర్పులతో రాజకీయాలు వేడిని రాజేస్తున్నాయి. టిక్కెట్టు లేదని భావిస్తున్న వారు ఇతర మార్గాల వైపు చూస్తున్నారు. ఇందులో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఉన్నారు. మూడో జాబితాలో రాయదుర్గం అభ్యర్థిగా మెట్టుగోవిందరెడ్డిని ప్రకటించిక ముందే ఆయన వైసిపి నుంచి బయటకు పోయారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సిడబ్లుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిని కలవడం చర్చనీయాంశమైంది. ఇది నడుస్తున్న తరుణంలోనే ఆయనకు సంబంధించిన క్వారీలపైనా గనుల శాఖ అధికారులు దాడులు చేయడం గమనార్హం. ఇక టిక్కెట్టు దక్కని వారిలో హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఉన్నారు. ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వచ్చిన వాటిల్లో సిట్టింగులుండీ అవకాశం లేకుండాపోతోంది. ఇక మంత్రి ఉషచరణ్‌శ్రీకి పెనుకొండ అసెంబ్లీకి మార్చగా, అక్కడున్న సిట్టింగ్ ఎమ్మెల్యే శంకరనారాయణను అనంతపురం పార్లమెంటుకు మార్చారు. ఈ మార్పుల పరిస్థితి ఇలా నడుస్తున్న క్రమంలో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఫేక్‌బుక్ లైవ్‌లో తొటి ఎమ్మెల్యేలపై పరోక్ష ఆరోపణలు పెద్ద దుమారమే రేగాయి. అటు తిరిగి, ఇటు తిరిగి ఆ వ్యాఖ్యలు పార్టీ వైపునకు మళ్లడంతో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ స్థానంలోనూ వచ్చే ఎన్నికల్లో మార్పు ఉండే అవకాశముందని ప్రచారం నడుస్తోంది. త్వరలోనే మరిన్ని జాబితాలు వచ్చే అవకాశాలుం ఉడటంతో ఇంకెన్ని రాజకీయ మలుపులు తిరుగనున్నాయన్నది చర్చ నడుస్తోంది. అధికార పార్టీ జాబితాలు రానుండటంతో ఇక ప్రతిపక్ష టిడిపి జాబితాలు సిద్ధమవుతున్నట్టు చర్చ నడుస్తోంది. సంక్రాంతి పండుగ తరువాత టిడిపి కూడా జాబితా విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆ పార్టీలోనూ సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. వైసిపి మార్పులకు అనుగుణంగా ఇక్కడా మార్పులుంటాయన్న చర్చ నడుస్తోంది. ఇకపోతే ఈవారంలో కార్మికుల సమ్మెకు సంబంధించి మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా పడింది. దీంతో కార్మికులు విధుల్లోకి చేరడంతో సమ్మె కారణంగా పేరుకుపోయిన చెత్త అంతా తొలగిపోయి పట్టణాలు శుభ్రతకు నోచుకుంటూ ఉన్నాయి. అయితే అంగన్‌వాడీల సమస్య మాత్రం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం చర్చలు జరిపినా ఫలించకపోవడంతో పండుగ తరువాత ఈ ఉద్యమం మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. విపక్షాలు కూడా కార్మికుల సమ్మెకు మద్దతునిస్తూ పాల్గొంటామని ప్రకటిస్తున్నాయి. దీంతో ఈ ఉద్యమం రాజకీయ మలుపు తిరిగే అవకాశాలున్నాయి. జిల్లాలోనూ ఇప్పటికే అంగన్‌వాడీ కార్మికులకు ఎస్మా చట్టం కింద నోటీసులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. ఇటు ఉద్యమ వేడి, ఇటు రాజకీయ వేడి చలిలోనూ వణుకు పుట్టిస్తున్నాయి.